## క్లుప్తంగా

### ఆసుపత్రిలో పండ్లు పంపిణీ



**గుంటూరు రూరల్:** గోరంట్ల గ్రామంలోని ప్రభుత్వ ఛాతి సంక్రమిత వ్యాధుల ఆసుపత్రిలో ఏఆర్‌టీ సెంటర్ నందు ప్రతి నెలా రెండో శనివారం జరిగే పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులకు గిఫ్ట్ బాక్స్‌లు, వాటర్ బాటిల్స్, పెన్సిల్స్, షార్ప్‌నర్స్, ఎరేజర్, కిట్లను అందించారు. అదే విధంగా బత్తాయి, ఆపిల్, దానిమ్మ కాయలు పంపిణీ చేశారు. భోజనం అందించారు. 8 మంది ఎదుగుదలలేని చిన్నారులకు వచ్చే నెల నుంచి రూ.500 లెక్కన అందించడం జరుగుతుంది తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

### అలరించిన సంగీత విభావరి



**పాత గుంటూరు:** అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఆదివారం విశ్వశాంతి ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి అట్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సప్తస్వరాలు పేరున సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయకులు నరసింహరావు, రవి కిరణ్, జి.వి.యస్. నాగేశ్వరరావు, బి.ఎస్. పోతురాజు, వెంకటరమణ, విజయలక్ష్మీ దయామణి పలు చిత్రాల్లోని పాటలను ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గాదె రత్నారెడ్డి, గౌరవ కార్యదర్శి తల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### తారావలి పద్యాలు జ్ఞానజ్వాలాగ్ని తోరణాలు



**పాత గుంటూరు:** లక్ష్మీపురం త్యాగరాజ సాంస్కృతిక కేంద్రంలో అజో విభా కందాళం ఫౌండేషన్, సంస్కృతి సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య అప్పాజోస్యుల విరచిత 'పావకవృత్త-సుజల వృత్త- తారావళులు 'పుస్తకావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన సాహితీవేత్త ఆచార్య అనుమాండ్ల భూమయ్య మాట్లాడుతూ ఆచార్య అప్పాజోశ్యుల పావక తారావలి పద్యాలు జ్ఞాన జ్వాలాగ్ని తోరణాలన్నారు. డాక్టర్ వెలువోలు నాగరాజ్యం, డాక్టర్ అద్దంకి దయాకర్, సన్నిధానం నరసింహ శర్మ లు అప్పాజోస్యుల సాహిత్య వైభవాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సాహిత్య వేత్త మోదుగుల రవికృష్ణ, అజోవిభవ్ ఫౌండేషన్ వడలి రాధాకృష్ణ, డాక్టర్ మైలవరపు లలిత కుమారి, త్యాగరాజ సాంస్కృతిక కేంద్రం కార్యదర్శి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు

### వంటల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



**పాత గుంటూరు:** కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఇండియా(కోవే) ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీపురంలోని కాటన్ అసోసియేషన్ హాల్‌లో మహిళలకు ఆరోగ్య పోషకాలతో కూడిన వంటల పోటీలు నిర్వహించారు. కోవే ఇండియా ఏపీ చాప్టర్ జాయింట్ సెక్రెటరీ అపర్ణ మాట్లాడుతూ ఆహార వంటకాల వ్యాపార రంగంలో ఔత్సాహిక మహిళలు ప్రవేశించి రాణించాలని అన్నారు. సేంద్రియ ఎరువుతో కూడిన పప్పు ధాన్యాలు, డ్రైఫ్రూట్స్, స్పైసెస్‌తో కూడిన వంటకాలకు మార్కెట్లో డిమాండ్ ఉందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలు డాక్టర్ ప్రసన్న, యశస్వి, వసంత, శివాని పాటిబండ్ల, లంక మాధవి, ఉమెన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ జోష్న పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వసంత నంబూరి, సక్కు మా. ధవి, రోటరీ ఆదర్శ్ బృందం పాల్గొన్నారు.

### ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

**పాత గుంటూరు:** బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరం ఇంటర్ ఆపైన గుంటూరులో చదువుతున్న ప్రతిభావంతులైన పేద బ్రాహ్మణ విద్యార్థిని, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందచేయనున్నట్లు ఉపకార వేతనాల కమిటీ చైర్మన్ జీ.వీ.ఎల్.ఎన్. సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేట 1/13లోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తులను పొందాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 19లోపు అందచేయాలని పేర్కొన్నారు. 94416 55888 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

# అందరి సహకారంతో పొన్నూరు పట్టణాభివృద్ధి

- ప్రతిపక్ష నేతల దుష్ప్రచారాలు నమ్మవద్దు
- జీబీసీ రహదారి విస్తరణకు 90 శాతం క్లియరెన్స్
- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

**చేబ్రోలు:** ప్రజలందరి సహకారంతో స్వర్ణపురిగా ఖ్యాతిగాంచిన పొన్నూరు పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పట్టణంలో రెండు రోజులుగా జరుగుతున్న జీబీసీ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పట్టణ ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తున్నట్లు చెప్పారు. పొన్నూరు పట్టణ రూపురేఖలు మారుస్తూ సువర్ణాక్షరాలతో లిఖించతగ్గట్లుగా పారదర్శకతతో పనిచేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రోడ్డు విస్తరణ పేరుతో ప్రజలను మోసం చేసిన ఘనత టీడీపీకి దక్కుతుందన్నారు. టీడీపీ నేతల మోసాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రస్తుత రోడ్డు విస్తరణలో భాగంగా అభివృద్ధికి సహకరిస్తున్న భవన యజమానులు అందరికీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు 90శాతం భవనాల తొలగింపు పనులు పూర్తయినట్లు ఆయన వెల్లడించారు. 60 అడుగుల వెడల్పు రోడ్డుతో పాటు, డ్రెయినేజీ, ఇతర మౌలిక వసతులను కల్పించి పొన్నూరు పట్టణాన్ని నూతన హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ దాసరి నారాయణరావు, స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, బొద్దులూరి రంగారావు, భవనం వంశీరెడ్డి, ఆకుల రామ్మోహన్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

## పోస్టాఫీసులో రూ.25కే త్రివర్ణ పతాకం

ప్రత్తిపాడు బ్రాంచ్ పోస్టుమాస్టర్ బి. సుబ్బారావు



జాతీయ జెండాలను అందిజేస్తున్న ప్రత్తిపాడు బ్రాంచ్ పోస్టుమాస్టర్ సుబ్బారావు

**ప్రత్తిపాడు:** స్థానిక పోస్టాఫీసులో త్రివర్ణ పతాకం అందుబాటులో ఉందని ప్రత్తిపాడు బ్రాంచ్ పోస్టుమాస్టర్ బి. సుబ్బారావు తెలిపారు. భారతావనికి స్వాతంత్య్రం సిద్ధించి 75 వసంతాలు పూర్తి చేసుకుని 76వ సంవత్సరంలోనికి అడుగు పెడుతున్న నేపథ్యంలో తపాలాశాఖ తక్కువ ధరకే పోస్టాఫీసుల ద్వారా త్రివర్ణ పతాకాన్ని విక్రయిస్తోందన్నారు. కేవలం రూ. 25 నామమాత్రపు ధరకే ప్రజలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నడింపాలెం గ్రామానికి చెందిన ఏలూరి ఖాజావలి ఆర్థిక సహకారంతో పోతురాజు లక్ష్మీనారాయణ పోస్టాఫీసు ద్వారా జాతీయ జెండాలను కొనుగోలు చేశారు. స్వాతంత్య్ర దినోత్సవం నాడు జెండాలను ప్రజలకు పంపిణీ చేయనున్నారు. అసిస్టెంట్ పోస్టుమాస్టర్ ఎలికా అప్పారావు, ఎస్.సత్యనారాయణ, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థతోనే సాధ్యం

వెనిగండ్ల–2 సచివాయం ప్రారంభోత్సవం



వెనిగండ్లలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ జ్యోతి

**పెదకాకాని:** జాతిపిత మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థతో సాధ్యమైందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి అన్నారు. వెనిగండ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని శనివారం ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో రెవెన్యూ సేవల కోసం కలెక్టరేట్, తహసీల్దారు కార్యాలయాలకు తిరిగే పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా గ్రామ ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు గ్రామంలోనే అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలు సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయ భవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, గామ సర్పంచ్ వేల్పుల శ్రావణి, ఎంపీటీసీ సభ్యులు మున్నంగి నాగరాణి, కె.లక్ష్మీరాజ్యం, వేల్పుల నాగరాజు, మాజీ సర్పంచ్‌లు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, బుల్లా ఆశీర్వాదం, ఆత్మకూరి ధర్మారెడ్డి, ఆత్మకూరి శ్రీనివాసరెడ్డి, ఆళ్ల ధర్మారెడ్డి, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహనరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుబాని, సొసైటీ చైర్‌పర్సన్‌లు శివాబత్తిన దయానంద్‌బాబు, మేరిగ సుబ్బారావు, శివాలయం ట్రస్టుబోర్డు చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పీఆర్ ఏఈ జగదీష్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 'కళ్లం' అధ్యాపకుడికి డాక్టరేట్



రాజీవ్ జట్సన్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి

**గుంటూరు రూరల్:** ప్రతి ఒక్కరి లక్ష్య సాధనకు తమ కళాశాల శక్తి వంచనలేకుండా కృషిచేస్తుందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమా శంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన సీనియర్ ప్రొఫెసర్ వి.రాజీవ్ జట్సన్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. 'ఏ క్యారెక్టరిస్టిక్ సెంట్రిక్ డెసిషన్ మేకింగ్ సాఫ్ట్‌వేర్ ప్రాసెస్ మోడల్' అనే అంశంపై డాక్టర్ జి.సత్యనారాయణ ప్రసాద్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం అభినందించింది.

## 'సఫాయి' సమస్యలు పరిష్కరించండి

అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా

**నెహ్రూనగర్:** నగరపాలక సంస్థ పరిధిలోని సఫాయి కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదేశించారు. శనివారం కమిషనర్ కీర్తి ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులతో నగరపాలక సంస్థ పరిధిలోని సఫాయి కార్మికుల సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పాటుపడే సఫాయి కార్మికుల సమస్యల పట్ల అధికారులు వేగంగా స్పందించాలన్నారు. ఇటీవల సఫాయి కార్మికులకు నేషనల్ సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై నాలా క్లీనింగ్ యంత్రాలు, స్వీపింగ్ యంత్రాలు అందించడం జరిగిందన్నారు. సదరు కార్మికులకు సేఫ్టీ కిట్స్ సకాలంలో అందించాలని, క్షేత్ర స్థాయిలో కార్మికులు తమ సమస్యలపై అందించే అర్జీలు, ఫిర్యాదులు పరిష్కారానికి ప్రజారోగ్య విభాగంలో ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని ఎంహెచ్ఓని ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, ఎస్ఎస్ ఆనందకుమార్, రాంబాబు, సోమ శేఖర్, ఆయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

## ఈమని లలితా కృష్ణకి గాయత్రీ సంగీత విద్వన్మణి బిరుదు



లలితాకృష్ణను సన్మానించిన అతిథులు

**పాత గుంటూరు:** బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ప్రధాన కార్యదర్శి ఎం. వై. శేషురాణి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌కు చెందిన ఈమని లలితా కృష్ణకు సన్మాన సభ నిర్వహించారు. డాక్టర్ సి.హెచ్. సుజాత జ్యోతి ప్రకాశనంతో ప్రారంభించారు. సభలో ముఖ్య అతిథులుగా వీవీఐటీ వి.అరుణా విద్యాసాగర్, రాష్ట్ర సంగీత, నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి, కలవల శ్రీ లక్ష్మీ రమేష్ , సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి. విజయ పాల్గొని ఈమని లలితా కృష్ణకు గాయత్రీ సంగీత విద్వన్మణి బిరుదు అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం లలితా కృష్ణ వాయిద్య కచేరి సంగీతాభిమానులు అలరించారు. సంస్థ కార్యదర్శి మంగాదేవి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు గురు పురస్కారాలు

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు గురు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రామనాథం అనిల్‌కుమార్ శనివారం ఓప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ పిలుపు మేరకు ఇప్పటి వరకు 1,200 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు వాట్సాప్ ద్వారా ప్రతిపాదనలు పంపగా, వారిలో 280 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. గుంటూరు నగరంలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంఘాలైన అపుస్మా, అప్సా, ఇండియన్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నుంచి 120 మంది అధ్యాపక, ఉపాధ్యాయులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 25వ తేదీ లోపు ఆయా పాఠశాలలు, విద్యాసంస్థల యాజమాన్యాల ద్వారా ఉత్తమ గురువులను ఎంపిక చేసి, 83413 23345 నంబరుకు దరఖాస్తులు పంపాలని సూచించారు. ఉత్తమ గురువులను ఎంపిక చేసి, 400 మందికి వచ్చేనెల 3వ తేదీన అమరావతిరోడ్డులోని కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఇతర ప్రజా ప్రతినిధుల సమక్షంలో పురస్కారాలను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

### విజిలెన్స్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులరెడ్డి

**నగరంపాలెం:** గుంటూరు రీజినల్ విజిలెన్స్/ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు సీఐగా శీలం శ్రీనివాసులు రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం గుంటూరు కలెక్టరేట్ ఆవరణలోని విజిలెన్స్ కార్యాలయంలో ఆయన సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ ఈశ్వరరావుని మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఆయన సీఐడీ, ఎస్‌బీ, కొత్తపేట పీఎస్ సీఐగా విధులు నిర్వహించారు.

### దూషించిన వ్యక్తిపై కేసు

**గుంటూరు ఈస్ట్:** భూమి కాపలాదారుడిని యజమాని కులం పేరుతో దూషించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం గుజ్జగుళ్ళకు చెందిన నాగమల్లేశ్వరరావుకి పలకలూరు రోడ్డులో 2.5 ఏకరాల భూమి ఉంది. 1993 నుండి లక్ష్మయ్య ఆ భూమిలో ఇల్లు నిర్మించుకుని కాపలాదారుడిగా ఉంటున్నాడు. జూలై 16వ తేదీ నాగ మల్లేశ్వరరావు భూ వివాదం నేపథ్యంలో లక్ష్మయ్యను కులం పేరుతో దూషించాడు. లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### క్రికెట్ టోర్నీ విజేత 'ఎంవీరాజు పాలెం'

**కర్లపాలెం:** ఎంవీ రాజుపాలెం యూత్ ఆధ్వర్యంలో స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల పరిధిలో జరిగిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ టోర్నమెంటులో ఎంవీరాజు పాలెం టీం విజయం సాధించింది. మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గుంట్రెడ్డి శివ రూ.20వేల నగదు, కప్పు అందజేశారు. రన్నర్ ఏట్రవారిపాలెం టీంకు పెట్రోల్ బంక్ ఓనర్ రవి రూ.15 వేల నగదును అందజేశారు. అలాగే తృతీయ స్థానంలో నిలిచిన పెదపులుగు వారిపాలెం టీమ్‌కు రూ.10 వేలు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.5 వేలు, 3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆట్ల నాగిరెడ్డి, తుమ్మా సుబ్రమణ్యం రెడ్డి, ఆట్ల రాజేంద్రరెడ్డి, గోపిరెడ్డి, బాజీరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం



టీజేపీఎస్ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు, విద్యార్థులు

**గుంటూరు ఎడ్యుకేషన్:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలోని టీజేపీఎస్, హిందూ, ఏసీ కళాశాలల ఎదుట ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్షుడు జాన్సన్‌బాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం పిడికిలి బిగించి, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విద్యార్థులను ఏకతాటిపైకి తెచ్చి 1396 ఆగస్టు 12న లక్నోలోని బెనిరస్ విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించినట్లు తెలిపారు. 87 ఏళ్లుగా అనేక విద్యార్థి ఉద్యమాలను నిర్వహించిందని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ, నగర అధ, కార్యదర్శులు జ్ఞానదీప్, యశ్వంత్, డేవిడ్, గౌతమ్, నితిన్, కిరణ్, బన్నీ, విజయ్ సాయి, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమీకృత వ్యవసాయంతో రైతులకు నిరంతర ఆదాయం

**గుంటూరు రూరల్:** సమీకృత వ్యవసాయంతో రైతులకు నిరంతర ఆదాయం లభిస్తుందని కడపకు చెందిన పశు వైద్యులు రాంబాబు తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్‌లో రైతులకు సమీకృత, ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ప్రతి రైతు పంటల సాగుతోపాటు కొన్ని పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలు వంటి వాటిని పోషిస్తూ ఆనందంగా జీవితాలను గడిపేవారన్నారు. రానురాను వివిధ రకాల కారణాల వల్ల రైతులు తమ పూర్తి సమయాన్ని ఒక్క పంటల సాగుకు మాత్రమే ఉపయోగిస్తూ అనుబంధ రంగాలను అశ్రద్ధ చేయడం జరుగుతుందన్నారు. దీనివల్ల రైతులకు అదనపు ఆదాయ వనరులు లేకుండా పోయి, ప్రతికూల పరిస్థితులలో రైతులు నష్టాలను చవిచూడవలసి వస్తోందన్నారు. దీనికి పరిష్కారంగా రైతులు తిరిగి పంటల సాగుతోపాటు పశుపోషణ చేపట్టాలని కోరారు. అన్ని మెళకువలు పాటించి సమీకృత వ్యవసాయం చేయగలిగితే రైతులకు తప్పనిసరిగా ఆదాయం మెరుగు పడుతుందన్నారు. సేంద్రియ సాగులో నాటు ఆవు ప్రాముఖ్యత గురించి ఫౌండేషన్ చైర్మన్ వై.వేంకటేశ్వరరావు వివరించారు. వివిధ రకాల కషాయాలు, ద్రావణాల ఉపయోగాలు, వాటి తయారీ విధానాలను ప్రత్యక్షంగా సేంద్రియ రైతు శివనాగమల్లేశ్వరరావు వివరించారు. మొదటి రోజు దేశీయ గో జాతుల గోశాలను, వానపాముల ఎరువు తయారీ ప్రక్రియను, ఘన జీవామృతం తయారీ విధానాన్ని, ఎద్దుగానుగతో నూనె తీసే ప్రక్రియను, ఆవు పేడతో ప్రమిదలు, దూప్‌స్టిక్స్ లాంటి వస్తువుల తయారీ విధానాన్ని, బహుళ అంచెల సాగు విధానాన్ని క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా చూపించడం జరిగింది.

## పారిశ్రామికవేత్తలుగా విద్యార్థులు ఎదగాలి

ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్ కుమార్ టెంటు



మాట్లాడుతున్న అనిల్ కుమార్

**చేబ్రోలు:** విద్యార్థులందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్ కుమార్ టెంటు అన్నారు. మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ''భారత్ పిచథాన్ 2.0'' కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ''ఎంపవరింగ్ ఎమర్జింగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్: నావిగేటింగ్ స్టార్టప్ ఫండింగ్ ఇన్ ఆంధ్రప్రదేశ్'' అనే అంశంపై ప్యానెల్ డిస్కషన్ నిర్వహించారు. అనిల్ కుమార్ టెంటు మాట్లాడుతూ సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చే విద్యార్థులకు కావలసిన ఆర్థిక తోడ్పాటును కూడా అందిస్తామన్నారు. విద్యార్థుల్లో ఎవరికైనా కొత్త ఐడియాలు వస్తే.. వాటిని వెంటనే అభివృద్ధి చేసి మార్కెట్‌లోకి విడుదల చేయాలన్నారు. హెడ్‌స్టార్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ గౌతమ్ శివరామక్రిష్ణన్ మాట్లాడుతూ దేశంలో వివిధ రకాల ఎంటర్‌ప్రెన్యూర్స్‌ను స్థాపిస్తే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టెక్నికల్ నాలెడ్జ్, నైపుణ్యాభివృద్ధితోనే జీవితంలో మంచి ఉపాధిని, ఉన్నత స్థానాలను పొందగలరన్నారు. ఏంజెల్ ఇన్వెస్టర్ నారాయణ స్వరూప్, రత్నాకర్ సామవేదం, అశ్వతి వేణుగోపాల్, వైస్ చాన్సలర్ పీ.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా జడ్జి



జిల్లా జడ్జి రాజగోపాలరావును సన్మానిస్తున్న ఆసుపత్రి యాజమాన్యం

**గుంటూరు రూరల్:** నగర శివారులోని గోరంట్ల గ్రామం, ఇన్నర్ రింగ్‌రోడ్డులో గల శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌ను జిల్లా జడ్జి రాజగోపాలరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ఎంతో పురాతనమైనదని, అనేక దీర్ఘకాలిక వ్యాధులకు పంచకర్మ వైద్యం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వందకు పైగా పడకలు గల అతి పెద్ద ఆయుర్వేదిక్ సూపర్ స్పెషాలటీ ఆసుపత్రి గుంటూరులో ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె.ధనలక్ష్మి, డాక్టర్ సాయిగౌతమి, డాక్టర్ ఎల్.మౌనిక, డాక్టర్ పి.భానుకశ్యప్, డాక్టర్ వి.సుస్మిత, డాక్టర్ హరికృష్ణ, మేనేజర్ మల్లేశ్వరి తదితరులు జిల్లా జడ్జిని ఘనంగా సన్మానించారు.

## ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించాలి

- తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ
- అలసత్వం ప్రదర్శిస్తున్న పదిమంది బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు



వడ్లమూడి వీఆర్వోకు సూచనలిస్తున్న తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ

**చేబ్రోలు:** బీఎల్వోలు ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించాలని తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ఇంటింటి సర్వేను శనివారం తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ పరిశీలించారు. సర్వే ఈ నెల 21తో ముగిస్తున్నప్పటికి విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న పదిమంది బీఎల్వోలకు తహసీల్దారు గోపాలకృష్ణ శనివారం షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సర్వే బాగా తక్కువగా ఉన్న వేజండ్ల (105), చేబ్రోలు(128), చేబ్రోలు(130), తోట్లపాలెం(143), వడ్లమూడి, శలపాడు(197) తదితర పోలింగ్ స్టేషన్‌ల బీఎల్‌వోల ఇంటింటి సర్వే ప్రోగ్రెస్‌లో వెనుకబడటంతో వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆయా చోట్ల సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేకు వలంటీర్లను తీసుకువెళ్లవద్దని స్పష్టం చేశారు.

## సమస్యలను పరిష్కరించాలి

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట 12 గంటల నిరసన దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో అనేక కార్యక్రమాలు చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఏపీఎన్జీవో గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల పోరాటాలకు ఉపాధ్యాయ ఉద్యమం దిక్సూచి వంటిదన్నారు. రాష్ట్ర మాజీ జేఏసీ చైర్మన్ సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం మినహా మరే ఇతర పెన్షన్ విధానాన్ని అంగీకరించేది లేదన్నారు. ఉపాధ్యా ప్రగతి సంపాదకుడు ఏవీ రామారావు మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా హక్కులు సాధించగలమని తెలిపారు. నిరసన దీక్షను సందర్శించిన వారిలో ఏపీ సీపీఎస్ఈఏ, సీఐటీయూ, కార్మిక సంఘాలతో పాటు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎం.కళాధర్, ఫ్యాప్టో నాయకులు డి. పెదబాబు, కె.బసవ లింగారావు, జి.వేళాంగిణిరాజు, బి.ఆదిలక్ష్మి, ఫైజుల్లా, ఖాలీద్, సుబ్బారెడ్డి, మేకల సుబ్బారావు ఉన్నారు.

## లివర్ సమస్యలను ముందస్తుగా గుర్తించవచ్చు

**గుంటూరు మెడికల్:** ఫైబ్రో స్కాన్ ద్వారా లివర్ సమస్యలను ముందస్తుగానే గుర్తించి చికిత్స చేయవచ్చని కేర్‌వెల్ హాస్పటల్‌కు చెందిన ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ షేక్ నాగూర్‌బాషా చెప్పారు. శనివారం స్థానిక గుంటూరువారితోట 7వలైనులోని కేర్‌వెల్ హాస్పటల్‌లో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ నాగూర్‌బాషా మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో సుమారు రూ. 10 వేలు ఖరీదు చేసే ఫైబ్రో స్కాన్‌ను 70 మందికి ఉచితంగా చేశామన్నారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కొద్దిరోజుల్లోనే మరో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని, లివర్‌సంబంధిత సమస్యలు తెలుసుకోవాలనుకునేవారు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్‌గౌస్‌బాషా కోరారు. పేర్లు నమోదు కోసం 8341713713, 9854757999 నంబర్లలో సంప్రదించాలన్నారు.